కలగానే జలవిహారం

- మానేరులో అలంకారప్రాయంగా క్రూజ్ బోట్
- సర్కారు నిర్లక్ష్యం.. పర్యాటక అభివృద్ధికి గ్రహణం • వాగుపాలవుతున్న కరకట్ట మట్టి
- ఆందోళనలో పర్యాటకులు

సిరిసిల్ల మానేరులో అలంకార ప్రాయంగా ఉన్న బోటు

నాడు.. మానేరును పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు బ్రిడ్జి నుంచి అయ్యప్ప ఆలయం వరకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన కరకట్ట (ఫైల్)

నేడు.. కరకట్టపై మొలిచిన పిచ్చిమొక్కలు

రాజన్న సిరిసిల్ల, మార్చి9 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల మానేరు వాగులో జలవిహారం కలగానే మిగిలిపోయింది. మధ్యమానేరు ప్రాజెక్టు నిర్మాణంతో గత బీఆర్ఎస్ సర్కారు సిరిసిల్ల మానేరు వాగుకు జలకళ తీసుకువచ్చింది. ఎదురెక్కివచ్చిన గోదావరి జలాలతో కోనసీమను తలపించేలా చేసింది. ఓ వైపు రామప్ప గుట్టలు, మధ్యలో మా నీటి అందాలతో ఉన్న ఈ ప్రాంతాన్ని అప్పటి మంత్రి కేటీఆర్ ప్రత్యేక కార్యచరణతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు రూపొందించింది. అందులో భాగంగా మానేరులో బోటును కూడా ప్రారంభించింది. అయితే ప్రభుత్వం మారడంతో లక్షలు ఖర్చుపెట్టి కొనుగోలు చేసిన క్రూజ్ బోట్ పట్టించుకునే వారు లేకపోవడంతో మానేరులో అలంకారయ ప్రాయంగా ఉండిపోయింది. కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో పర్యాటక అభివృద్ధికి గ్రహణం పట్టింది. అలాగే కరకట్ట కోసం పోసిన మట్టి వాగుపాలవుతుండగా, పిచ్చి మొక్కలు మొలిచి ఎందుకు పనికి రాకుండాపోతున్నది.

ప్రశ్నార్థకంగా పర్యాటకం

కార్మిక, ధార్మిక క్షేత్రానికి నెలవైన సిరిసిల్లలో పర్యాటక కేంద్రం ఒక్క అడుగు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కిపడుతున్నది. గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి మానేరులోని బ్రిడ్జి నుంచి అయ్యప్ప ఆలయం వరకు కరకట్ట నిర్మించింది. అయితే కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో పిచ్చిమొక్కల మొలిచి కరకట్ట మట్టి వాగుపాలవుతున్నది. ప్రారంభించిన బోటు జలవిహారం కలగానే మిగిలింది. కొత్త సర్కారులో పర్యాటకం పరుగులు పెడుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. మధ్య మానేరు ప్రాజెక్టు నుంచి ఎదురెక్కిన గోదావరి జలాలతో సిరిసిల్ల మానీటి అందాలు సందర్శకులను పరవశిజింపజేస్తుంటాయి. జిల్లా వాసులందరికీ వీకెండ్ స్పాట్గా, పర్యాటక కేంద్రం చేయాలన్న ఉద్దేశంతో గత ప్రభుత్వంలో మంత్రి కేటీఆర్ ప్రతిపాదనలు చేశారు. సిరిసిల్ల మానేరు, ఇల్లంతకుంట మండలంలోని అన్నపూర్ణ రిజర్వాయర్, మధ్యమానేరు జలాశాయలను కలుపుతూ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదనలు చేశారు. అందులో భాగంగా రామప్ప గుట్ట నుంచి బ్రిడ్జి ఎడుమ వైపు మొదటిదశలో మానేరు వాగును ఆనుకుని కరకట్టను నిర్మించారు. రెండో దశలో కుడి వైపు బ్రిడ్జి నుంచి బతుకమ్మఘాట్, అంబభవాని, అయ్యప్ప ఆలయాలను కలుపుతూ 80ఫీట్లతో రెండో కరకట్ట నిర్మాణం చేపట్టారు. గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేసే వాగు నుంచి మొదలు అయ్యప్ప ఆలయం వరకు కరకట్ట నిర్మాణం ప్రారంభించారు. మీటరు ఎత్తున మట్టిపోసి సుమారు నాలుగు కిలోమీటర్ల మేర కట్ట నిర్మాణం జరిగింది. బతుకమ్మ ఘాట్, అంబభవాని, అయ్యప్ప ఆలయాల వద్ద పార్కుల నిర్మాణాలు నిలిచి పోయాయి.

పని చేయని మ్యూజికల్ ఫౌంటెన్

సందర్శకులను కనువిందు చేసేందుకు గానూ మాజీ కేటీఆర్ మానేరు వాగు పక్కన బతుకమ్మఘాట్‌ను నిర్మించారు. వందలాది మంది కూర్చుండి వీక్షించేందుకు లక్షలాది రూపాయలు వెచ్చించి మ్యూజికల్ ఫౌంటెన్ ఏర్పాటు చేయించారు. ప్రతి ఆదివారం రాత్రి ఏడు నుంచి 9గంటల వరకు మ్యూజికల్ ఫౌంటెన్ కనువిందు చేసేలా రంగురంగల నీళ్లతో సందర్శకులను ఆకట్టుకునేది. ప్రస్తుతం పర్యవేక్షణ లోపంతో మ్యూజికల్ ఫౌంటెన్ పని చేయడం లేదు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చొరవ తీసుకుని ఫౌంటెన్ పునర్ప్రారంభించాలని, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

గజసింగవరంలో ఎండుతున్న పొలాలు

- జీవాల మేతకు 40 మంది రైతుల 25 ఎకరాల వరి పంట

ఎండిపోతున్న తన వరి పొలంలో రైతు ఈరవేని భాగ్యవ్వ

గంభీరావుపేట, మార్చి 9: మండలంలోని గజసింగవరం రైతుల బోరు బావుల్లో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో 40 మంది రైతుల సుమారు 25 ఎకరాల్లో వరి పొలాలు ఎండిపోతున్నాయి. గ్రామ శివారు మల్లేశం గుట్ట ప్రాంతంలో సుమారు 100 ఎకరాల్లో బోర్ల కింద యాసంగి వరి పంట సాగు చేశారు. ఈ ప్రాంత ప్రతి రైతు బోరు భూగర్భ జలాలు అడుగంటి ఎత్తివేయడంతో పొట్ట దశకు చేరిన చేనులో 25 శాతం మేర పంటలు ఎండిపోతున్నాయి. ఎలాగైనా సాగు చేసిన పంటను కాపాడుకుందామని కొత్తగా వందల ఫీట్లు బోర్లు వేసినా చుక్కనీరు రావడం లేదని, పెట్టుబడితో పాటు పైసలు అదనంగా ఖర్చు అవుతున్నాయని రైతులు మొరపెట్టుకుంటున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇన్ని ఎకరాల్లో ఎన్నడూ ఈ విధంగా యాసంగిలో సాగు చేసిన వరి పంటలు ఎండిపోలేదని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

సింగసముద్రం బుంగ పూడ్చివేత

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: గంభీరావుపేట మండలం సింగసముద్రం చెరువు పొర్లు మత్తడిని కొందరు దుండగులు ధ్వంసం చేయగా ఎల్లారెడ్డిపేట ఆయకట్టు రైతులు పూడ్చి వేశారు. ఆదివారం చెరువు వద్దకు చేరుకుని ఎస్కవేటర్ సాయంతో బుంగను మట్టితో పూడ్చారు. ఎవరైనా మళ్లీ నీటి చౌర్యానికి పాల్పడితే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రైతులు నీటి పారుదలాశాఖ అధికారులను కోరారు.

ఆయిల్ పామ్ రైతులకు చేయూతనివ్వాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు

ముస్తాబాద్, మార్చి 9 : ప్రభుత్వం ఆయిల్ పామ్ రైతులకు చేయుతనివ్వాలని, మెయింటెనెన్స్ కోసం అందిస్తున్న ఆర్థిక సాయం వెంటనే అందించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపెల్లి సురేందర్‌రావు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఇచ్చిన వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరుల సమమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఆయిల్ పామ్ తోటలను పెంచేందుకు గత ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తూ ఆయిల్ పామ్స్ పెట్టిన రైతులకు ఎకరాకు రూ.4 వేలు ప్రోత్సాహకం అందించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడుస్తున్నా ఆయిల్ పామ్ రైతులను గుర్తించడం లేదన్నారు. ఆయిల్ పామ్ మొక్కలను పెంచుతున్న రైతులకు గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఎకరాకు రూ.4 వేల ప్రోత్సాహకాన్ని తక్షణమే అందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చాంబర్‌లో వినతి పత్రం అందించినట్లు ఆయన తెలిపారు. ఆయిల్ పామ్‌ను పెంచుతున్న రైతులకు ప్రభుత్వం వెంటనే ప్రోత్సాహకం అందించి సహకరించాలని మంత్రికి ఇచ్చిన వినతి పత్రంలో కోరామని తెలిపారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

పడాల శ్యామ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఏఎంసీ చెర్మన్, నాయకులు

రుద్రంగి, మార్చి 9 : మండల కేంద్రానికి చెందిన యువకుడు పడాల శ్యామ్ (35) నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందుతుండగా మెరుగైన చికిత్స కోసం ఆదివారం పలువురు నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుపేద కుటుంబానికి చెందిన అతడికి మెరుగైన వైద్య చికిత్స అందించాలనే ఉద్దేశ్యంతో రుద్రంగి గ్రామానికి చెందిన బొల్లి కుమార్, మారం గోపి ఇచ్చిన రూ.16వేలను శ్యామ్ కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. ఇంకా ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి, నాయకులు దువ్వాక గంగాధర్, గడ్డం స్వామి, రెడ్డి, శ్రీధర్, లింగం, రామకృష్ణ, శంకర్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సమ్మేళనంలో గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 9: అల్మాస్‌పూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2004-05 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సమ్మేళనంలో వారు గత స్మృతులను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించి గురుభక్తిని చాటుకున్నారు. పలువురు పూర్వవిద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని రోజంతా ఆనందంగా గడిపారు. ఇక్కడ ఉపాధ్యాయులు శేఖర్, సత్యనారాయణ, గోపాల్ రెడ్డి, నాగేంద్రం, శ్రీనివాస్, దత్తాత్రేయ, శ్యామ్‌సుందర్, చంద్రమోహన్, అంజల్‌రెడ్డి, మధుకర్ ఉన్నారు.

గుండారంలో ప్రజాపాలన లీలలు

గుండారంలో తన కొడుకు పేరుమీద వచ్చిన రేషన్‌కార్డు ప్రొసీడింగ్ చూపుతున్న దంపతులు

ఎల్లారెడిపేట, మార్చి 9: పైలెట్ గ్రామం గుండారంలో సంక్షేమ పథకాల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసి ఇచ్చిన ప్రొసీడింగ్ పత్రాలు తప్పుల తడకలుగా మారడంతో లబ్ధిదారులు ఆఫీసుల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడింది. గతంలో పలు గ్రామాల్లో నాలుగు ప్రభుత్వ పథకాలైన రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా పథకాలపై ప్రజాపాలన వేదికలపై అర్హులు, లబ్ధిదారుల జాబితాను గ్రామస్తులందరి సమక్షంలో వెల్లడించారు. ఆ సమయంలో తీవ్ర గందరగోళం చోటు చేసుకోగా మండలంలో ఒక్కో గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పైలట్ గ్రామంగా గుండారంను ఎంపిక చేసి లబ్ధిదారుల జాబితాను వెల్లడించారు. ఈ సందర్భంగా రేషన్‌కార్డులు 37 మందికి, ఇందిరమ్మ ఇండ్లు 36 మందికి, ఆత్మీయ భరోసా 92 మందికి, రైతు భరోసా 260 మందికి మొదటి దఫాలో ఇస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు బంధు మినహా మిగతా రెండు పథకాలు సంపూర్ణంగా అమలు కాక పోవడంతో లబ్ధిదారులు ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న పరిస్థితి నెలకొన్నది. రేషన్ కార్డుల్లో దొర్లిన తప్పులపై కార్యదర్శి దేవరాజును వివరణ కోరగా సుమారు 95 శాతం కార్డులు చిన్నపిల్లల పేర్ల మీదనే వచ్చాయని వాటిని పైఅధికారులకు సమాచారం ఇచ్చామని, త్వరలోనే తల్లిదండ్రుల పేర్ల యాడ్ అయి వస్తాయన్నారు.

పిల్లలకిచ్చి తల్లిదండ్రులను మరిచారు

గ్రామంలో 37 మందికి రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు ప్రకటన చేసిన సందర్భంలో గ్రామస్తులు సంతోషించారు. తీరా ప్రొసీడింగ్ చూస్తే తమకు పుట్టిన పిల్లల పేర్ల మీద ప్రత్యేక రేషన్‌కార్డు మంజూరై అందులో తమ పేర్లు లేకపోవడంతో కంగుతిన్నారు. 4,5 రేషన్‌కార్డులు మినహాయిస్తే 95 శాతం రేషన్‌కార్డులు కేవలం పిల్లల పేర్లమీదే రావడంతో తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు రెండు నెలల నుంచి ఆఫీసు చుట్టూ తిరుగుతున్న పరిస్థితి ఏర్పడింది. ఎడిట్, డిలీట్ ఆప్షన్ ఉందంటూ ప్రకటన చేసిన ప్పటికీ ఆన్‌లైన్‌లో పెండింగ్ చూపడంతో అధికారులు లబ్ధిదారులకు ఏం చెప్పాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

రేషన్‌కార్డు మా బాబు ఒక్కడి పేరుమీదే వచ్చింది

గత జనవరి 26 తారీఖునాడు మా ఊర్లో ప్రజాపాలన సభ జరిగింది. నా పేరు మాతమ్ముని పేరు రాము, లక్ష్మణ్ మా పేర్లు మా నాన్న నర్సయ్య అమ్మ లక్ష్మి రేషన్‌కార్డులో ఉన్నాయి. నాకు కవితతో 2022లో వివాహం జరిగింది. మాకు 18 నెలల బాబు ఉన్నాడు. గవర్మెంటు వచ్చి కొత్తలో రేషన్‌కార్డు కోసం అప్లై జేసినం, జనవరి 26 తారీఖునాడు ప్రజాపాలన సభ మీద రేషన్‌కార్డు ప్రొసీడింగ్ ఇస్తే మాకు రేషన్‌కార్డు వచ్చిందని సంతోషించిన, కానీ కార్డు మా బాబు శర్వింద్ ఒక్కడి పేరు మీదనే వచ్చింది. అందులో మా పేర్లు లేవు. మళ్లీ కార్డు కోసం తిరిగినా ఇంకా కొత్త రేషన్‌కార్డు రాలేదు.

-గూడెపు రాము-కవిత దంపతులు, గుండారం, ఎల్లారెడ్డిపేట.

బావిలో పూడిక తీస్తుండగా..

- మట్టిపెళ్లలు మీదపడి కార్మికుడి మృతి

రాములు (ఫైల్)

చందుర్తి,మార్చి 9: బావిలో పూడికతీత తీస్తున్న కార్మికుడిపై మట్టి పెల్లలు పడి మృతి చెందిన సంఘటన చందుర్తి మండలం లింగంపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికీ చెందిన కూలీ గద్దరాసి రాములు (44) వ్యవసాయ బావిలో పూ డిక తీస్తుండగా పైనుంచి మట్టి కూలడంతో మృతి చెందాడు. ఈ సంఘటన గ్రామంలో తీరని విషాదాన్ని నింపింది. స్థానికుల, పోలీసుల కథనం ప్రకారం, మండలంలోని జోగాపూర్ గ్రామానికి చెందిన రైతు మల్లయ్యకు చెందిన వ్యవసాయ బావిలో శనివారం పూడికతీత పనులు చేస్తున్న సమయంలో మట్టి పెల్లలు పడి లింగంపేట గ్రామానికి చెందిన గద్దె రాసి రాములు తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఇతడిని వెంటనే వేములవాడ ప్రభుత్వ దవాఖాకు తరలించారు. వైద్యం చేస్తుండగా అపస్మారక స్థితిలోకి చేరడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్న సమయంలో మార్గంమధ్యలో ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడని తెలిపారు. రాములు భార్య నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు. రాములుకు భార్యతోపాటు కుమారుడు, కూతురున్నారు.

కేక్ కట్ చేసి సంబురాలు

ఇల్లంతకుంట, మార్చి 8 : మండలంలోని అనంతగిరి ముత్యాల పోచమ్మ దేవాలయంలో ఆదివారం జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పాల్గొని కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం సిద్ధం వేణు అనంతగిరి ముత్యాల పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పెళ్లి వేడుకలో బీఆర్ఎస్ నాయకులు

ముస్తాబాద్, మార్చి 9 : మండల కేంద్రంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాచమడుగు సంతోష్‌రావు బావమరిది పూర్ణచందర్‌రావు వివాహ వేడుకల్లో మండల బీఆర్ఎస్ నాయకులతోపాటు వివిధ పార్టీల నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మండల కేంద్రంలోని ఏఆర్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన వివాహానికి వివిధ పార్టీల నాయకులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొంపేల్లి సురేందర్ రావు, ముస్తాబాద్ మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌రావు, మాజీ జడ్పీటీసీ గుండం నర్సయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, అంజన్‌రావు, గోపాల్‌రావు, వేముల రవీందర్, మాజీ సర్పంచ్ పండరి, శ్రీనివాస్‌రావు, వేణురావు, జితేందర్‌రావు, ఏనుగు వేణు, రమేశ్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్ నాయకులు పాల్గొన్నారు.

రెండో బ్రిడ్జి పనులకు శంకుస్థాపన

వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ వద్ద రెండో బిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వేములవాడ, మార్చి 9 : వేములవాడ పట్టణంలోని మూలవాగుపై రెండో బిడ్జి పనులకు రూ.6.85 కోట్లతో శంకుస్థాపన చేసినట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బిడ్జి పునర్నిర్మాణ పనులకు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, బిడ్జి నిర్మాణంలో నష్టపోయే వారికి పరిహారం అందిస్తామన్నారు. తొమ్మిది మాసాల్లో బిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ప్రజలు తమ ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం ఈ నెల 31 వరకు అవకాశం కల్పించిందన్నారు. అనంతరం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ

జాతీయస్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 9: పెద్దపల్లిలోని ఎంబీ గార్డెన్స్‌లో ఆల్ స్టైల్ కుంగ్ పూ యూనిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కుంగ్ పూ, కరాటే పోటీల్లో సిరిసిల్ల విద్యార్థులు సత్తా చాటారు. ఈ పోటీల్లో స్పార్క్ కుంగ్ పూ అకాడమీ ఆధ్వర్యంలో హాజరైన 16మంది విద్యార్థుల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్, వొడ్నాల అన్నపూర్ణ అభినందించారు. కార్యక్రమంలో ఆల్ స్టైల్స్ కుంగ్ పూ యూనిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు లింగమూర్తి, శ్రీధర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేత ఔదార్యం

సిరిసిల్లలోని 36వ వార్డులో పవర్‌బోర్ మరమ్మతు పనులు చేయిస్తున్న మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు

సిరిసిల్ల టౌన్, మార్చి 9: సిరిసిల్ల పట్టణంలోని 36వ వార్డులో బీఆర్ఎస్ నేత, మాజీ కౌన్సిలర్ కల్లూరి రాజు తన ఔదార్యం చాటుకున్నారు. వార్డు పరిధిలోని వెంకంపేట ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలోని పవర్ బోరు చెడిపోగా విషయం తెలుసుకున్న కల్లూరి రాజు తన సొంత డబ్బులతో మరమ్మతు చేయించారు. దీంతో కాలనీవాసులు రాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానికులకు నీటి అవసరాల కోసం పవర్ బోర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి ఎక్కువైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.

వివాహిత ఆత్మహత్య

శిరీష (ఫైల్)

తిమ్మాపూర్, మార్చి9: కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని అలుగునూర్ గ్రామంలో చోటుచేసున్నది. గ్రామానికి చెందిన సిల్ల శిరీష (25) కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం కడుపునొప్పి తీవ్రమై భరించలేని స్థితిలో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎల్ఎండీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎంఐలు ఎల్లక.. ఇన్సూరెన్స్‌కు ఆశపడి

- వ్యాన్‌కు నిప్పుపెట్టిన యజమాని
- అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన తంగళ్లపల్లి ఎస్ఐ రామ్మోహన్

తంగళ్లపల్లి ఎస్ఐ రామ్మోహన్

సిరిసిల్ల రూరల్, మార్చి 9: ఈఎంఐలు ఎల్లక, ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ఆశపడి వ్యాన్‌ను తగులబెట్టాడు. ప్రమాదవశాత్తు జరిగిందంటూ చిత్రీకరించాడు. పోలీసుల విచారణలో యజమాని ఇన్సూరెన్స్ డబ్బుల కోసం తగలబెట్టినట్లు తేల్చేశారు. ఈ ఘటన తంగళ్లపల్లి మండలం టెక్స్‌టైల్ పార్కులో జరిగింది. ఆదివారం తంగళ్లపల్లి ఎస్ఐ రామ్మోహన్ వివరాలు వెల్లడించారు. ఈ నెల 8న రాత్రి వేళలో టెక్స్‌టైల్ పార్కు గేటు సమీపంలో గల రోడ్డుపై ఐచర్ వ్యాన్‌లో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనపై టెక్స్‌టైల్ పార్కు గ్రామ కారోబార్ గౌడ రాజ మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు. వ్యాన్ ఓనర్ అయిన నిమ్మల మహేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. పోలీసు విచారణలో 9 నెలల క్రితం ఫైనాన్స్ ద్వారా వ్యాన్ కొనుగోలు చేశాడు. వ్యాను తరచూ రిపేరుకు రావడం, సరైన కిరాయిలు దొరకకపోవడంతో నెలనెలా ఈఎంఐల డబ్బులు కట్టలేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఎలాగైనా వ్యాన్ ప్రమాదవశాత్తూ మంటల్లో కాలిపోయిందని ఇన్సూరెన్స్ వాళ్లను నమ్మించి, వచ్చిన డబ్బులతో ఫైనాన్స్ డబ్బులు కడితే తన ఆర్థిక ఇబ్బందులు తీరుతాయనుకున్నాడు. నిన్న రాత్రి పెట్రోల్ బంకులో పెట్రోల్ తీసుకొచ్చి అతడు వ్యాన్ క్యాబిన్లో పెట్రోల్ పోసి నిప్పు అంటించి అక్కడి నుంచి పారిపోయినట్లుగా ఎస్ఐ రామ్మోహన్ వివరించారు.

పరామర్శ

వేములవాడ, మార్చి 9: వేములవాడ పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది చెర్ల ఆనంద్ కుమార్ ఇటీవల మృతి చెందగా ఆదివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ వారి దినకర్మలో పాల్గొని వారి చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుడిని ప్రార్థించారు.

సామాజిక సేవ అభినందనీయం



సీసీ కెమెరాల దాతను సన్మానిస్తున్న హన్మాండ్లు

గంభీరావుపేట, మార్చి 9: గ్రామానికి చెందిన గిరేందర్‌రావు శ్రీగాధ అభివృద్ధిలో భాగస్వామ్యుడై తన వంతుగా సీసీ కెమెరాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని పర్వ హన్మాండ్లు అన్నారు. మండలంలోని శ్రీగాధ గ్రామానికి చెందిన కల్వకుంట్ల గిరేందర్‌రావును ఆదివారం బీసీ సంక్షేమ శాఖ రాష్ట్ర అధికార ప్రతినిధి పర్వ హన్మాండ్లు సన్మానించారు. రానున్న రోజుల్లో గ్రామానికి మరెన్నో సేవలందించాలని ఆకాంక్షిస్తూ పంచాయతీ ఆవరణలో వారిని గ్రామస్తులతో కలిసి సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో నేతలు కాశాగౌడ్, మోహన్, గణేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు, సుద్దాల రాము, శ్రావణ్‌రావు తదితరులున్నారు.